మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

బాలానగర్: మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీకి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బొట్టు విష్ణు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నాయకులపై బూతులు మాట్లాడటం కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని సూచించారు. ఓటమి భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం లేదని విమర్శించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే ఎమ్మెల్యే కృష్ణారావుపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ, రోడ్డు నంబర్ 4లోని కేకే రెడ్డి హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. మధుమేహ గ్రస్తులు, ప్యాటీ లివర్, మద్యపానం అలవాటు ఉన్నవారు, ఊబకాయం వంటి సమస్యలకు చికిత్స అందించనున్నారు. లివర్ గురించి తెలుసుకునేందుకు 5 వేల విలువ గల అత్యాధునిక పైబ్రోస్కాన్ లివర్ డ్యామేజ్‌ను పసిగట్టే స్కానింగ్ పరీక్ష చేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు డా. అనుషా కంతేటి, డా. ఎం. మనీషా, డా. ఐ.ధనలక్ష్మిల పర్యవేక్షణలో చికిత్స అందించనున్నారు. అదేవిధంగా ఈసీజీ, పీఎఫ్‌టీ, ఆర్‌బీఎస్, యూరిక్ యాసిడ్, ఫైబ్రో స్కాన్‌లను చేయనున్నట్లు తెలిపారు. ఈ సదావకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి


కార్పొరేటర్‌కు సమస్యను వివరిస్తున్న కాలనీ వాసులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ ఫేజ్ 3 కాలనీలో నిత్యం కరెంట్ ట్రిప్ అవుతుందని శుక్రవారం కాలనీ వాసులు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎలక్ట్రికల్ ఏఈని సంప్రదించి త్వరగా సమస్యను పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి రోజు విద్యుత్ అంతరాయం కలుగుతున్నదని, ఇంట్లో ఎలక్ట్రికల్ సామాన్లు కాలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగ్యనగర్ ఎలక్ట్రికల్ సెక్షన్ ఏఈ దయానంద్, లైన్‌మెన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దారిదోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

10 సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం

మియాపూర్: రాత్రి పూట బైక్‌పై ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులను అడ్డుకుని దాడి చేయడంతో పాటు వారి వద్దనున్న డబ్బులు, మొబైల్ ఫోన్లను లాక్కుని వెళ్తున్నా ఇద్దరిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ రమేష్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం....మెదక్ రేగోడు మండలం లింగంపల్లికి చెందిన బి. ఆగమయ్య(19) కూకట్‌పల్లిలో ఉంటున్నాడు. అతని స్నేహితుడైన జగద్గిరిగుట్టకు చెందిన బాసోడి అభిషేక్(25) ఇద్దరు కలిసి గత కొన్ని నెలల నుండి రాత్రి సమయాల్లో దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో బిహార్‌కు చెందిన ఎండి. జావీద్ జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 7వ తేదీ తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో మియాపూర్ గోకుల్‌ప్లాట్స్‌లోని ఓ హోటల్‌లో ఆహారం తీసుకుని డెలివరీ నిమిత్తం బయల్దేరాడు. సమీపంలో యూటర్న్ చేస్తుండగా ఆగమయ్య, అభిషేక్‌లు ఇరువురు జావీద్‌ను అడ్డుకున్నారు. గంజాయి డెలవరీ చేస్తున్నామని బెదిరించి హెల్మెట్‌తో దాడి చేశారు. ఒకరు అతని వాహనం తీసుకుని కొండాపూర్ వైపు తీసుకువెళ్లి జావీద్ వద్ద నుండి రూ.5వేలు, రెండు సెల్‌ఫోన్లను లాక్కుకున్నారు. ఫోన్ పే పాస్వర్డ్, బైక్ కీలను తీసుకున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి కొండాపూర్‌లోని నిర్మాన్యుష ప్రాంతంలో వదిలేసి వెళ్లిపోయారు. జావిద్ భయంతో స్వంత ఊరుకు వెళ్లిపోయాడు. అనంతరం జావిద్ కనిపించడం లేదంటూ జావిద్ సోదరుడు తల్హా మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు చేశారు. దీంతో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకున్నారు. వారం రోజుల తర్వాత దావిద్ స్వంత ఊరునుండి ఫోన్ చేసి తన సోదరుడు తల్హాకు జరిగిన విషయం తెలిపాడు. దీంతో మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా కొండాపూర్ ఏఎంబీ మాల్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఆమగయ్య, అభిషేక్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు.

- ఇదే తరహాలో గత నెల రోజులుగా గచ్చిబౌలి, జుబ్లీహిల్స్, మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదై ఉన్నాయి. గచ్చిబౌలి, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి ఆగమయ్య, అభిషేక్‌లను అరెస్ట్ చేసి వారి వద్దనుండి 10 మొబైల్ ఫోన్లు, ఓ గోల్డ్ రింగ్ ,యాక్సెస్ స్కూటీని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు విషయంలో పోలీసుల పనితీరు అభినందనీయమని మియాపూర్ క్రైమ్ డీఐ రమేష్ నాయుడు, సిబ్బంది ప్రేమ్ కుమార్, పుల్యానాయక్, చంద్రబోస్, పూర్ణచందర్, జగన్, సాయిలను మాదాపూర్ డీసీపీ వినీత్, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావులు అభినందించారు.

అటకెక్కిన రోడ్డు వెడల్పు!

నాడు ఇళ్లకు మార్కింగ్ వేసిన అధికారులు

ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రధాన రహదారి విస్తరణకు 2018లో బీజం పడింది. అనంతరం పనులు ముందుకు సాగలేదు. ఆరు సంవత్సరాలు దాటినా పనుల్లో పురోగతి లేదు. పెండింగ్‌లో ఉన్న ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రధాన రహదారి విస్తరణకు స్టాండింగ్ కమిటీలో కూడా ఆమోదం లభించింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ కృషి ఫలితంగా అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించడంతో రోడ్డు విస్తరణ పనులకు ఆమోదం లభించింది. తర్వాత కూడా పనులు ముందుకు సాగలేదు. నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారి

- గతంలోనే 30 మందికి నోటీసులు
- సంవత్సరాలు దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే


ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రధాన ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ప్రధాన రహదారి ఇరుకుగా ఉంది. దీంతో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు సతమతం అవుతున్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రధాన రహదారిని ప్రియదర్శిని హోటల్ నుంచి ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తా మీదుగా హస్మత్‌పేట చౌరస్తా, దుబాయి గేట్ వరకు రోడ్డు విస్తరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఎమ్మెల్యే 2018లో అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. అందరి అభిప్రాయాలను తెలుసుకుని రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించాలని భావించారు. అందుకు అనుగుణంగానే ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారిని విస్తరణను త్వరితగతిన ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులకు సూచించారు.

30 మందికి నోటీసులు

రహదారి విస్తరణలో ఎన్ని ఇళ్లను తొలగించాల్సి ఉందనే దానిపై అధికారులు తగిన ప్రణాళికలను రూపొందించారు. రోడ్డు విస్తరణ సందర్భంగా 300 ఇళ్లను తొలగించాల్సి ఉందని అధికారులు తేల్చారు. 2018 డిసెంబర్‌లో నివాసితులకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధం చేశారు. వెంటనే మొదట 30 మందికి నోటీసులు జారీ చేశారు. గోడలకు మార్కింగ్ కూడా వేశారు. కానీ పనులను చేపట్టడంలో మాత్రం అధికారులు ముందడుగు వేయలేక పోయారు.

80 ఫీట్లకు బదులు 60 ఫీట్ల వరకు

రెండు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో


ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తా రోడ్డు వ్యూ

సమీక్షా సమావేశం నిర్వహించి రోడ్డు విస్తరణపై చర్చించారు. ప్రజల కోరిక మేరకు ప్రధాన రహదారిని 80 ఫీట్లకు బదులు 60 ఫీట్ల వరకు వైడనింగ్ చేయాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌లో పెట్టారు. స్టాండింగ్ కౌన్సిల్‌లో రోడ్డు విస్తరణకు ఆమోదం తెలిపింది. ముందుగా నోటీసులు జారీ చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని భావించారు. అధికారులు అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకున్నారు. ఇంత జరిగినా పనులు మాత్రం మొదలు కాలేదు. దీంతో ప్రజలు మళ్లీ రోడ్డుకు అనుకుని నిర్మాణాలను చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి.

దేశానికి ఆదర్శంగా కాంగ్రెస్ పాలన


కార్యక్రమంలో మాట్లాడుతున్న బండి రమేష్

నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

మోతీనగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి దేశానికే సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పాలన ఆదర్శంగా నిలిచిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బీసీ బిల్లుతో బడుగు, బలహీన వర్గాల దశ తిరగబోతుందన్నారు. అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, సీనియర్ నాయకులు దేవరింటి మస్తాన్ రెడ్డి, విఠల్ రెడ్డి, నరసింహ యాదవ్, రవీందర్ ముదిరాజ్, ప్రకాష్, జమీర్, నజీర్, నయీమ్, శివ చౌదరి, రమణ, పన్నాల రాజశేఖర్ రెడ్డి, వేణు, భారతమ్మ, రేష్మ, శ్రీనివాస్ రెడ్డి, ఉపేంద్ర, ఆదినారాయణ, సతీష్‌రెడ్డి, సత్యనారాయణ, అనిల్, నరేందర్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ 10వ వార్షికోత్సవం



మూసాపేట: మూసాపేటలోని మహంకాళి, సరస్వతి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు ప్రసాద్, సాకేత్‌ల సమక్షంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, కుంకుమార్చనలు, హోమం వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

- కాలం చెల్లిన పదార్థాలు ధ్వంసం, మరికొన్ని సీజ్
- నోటీసులు జారీ, పరీక్షల కోసం ల్యాబ్స్‌కు తరలింపు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పసుపు, కారం, మసాలాల తయారీ, నిల్వ, విక్రయకేంద్రాలు, పలు రెస్టారెంట్లపై రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్నింటిని సీజ్ చేయటంతో పాటు మరికొన్నింటిని ధ్వంసం చేశారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్, శ్రీశిక, పి.స్వాతి, జగన్నాథ్‌తో కూడిన బృందం మేడ్చల్ జిల్లాలోని కిష్టాపూర్ సర్వే నంబర్ 819 , హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సూర్య మసాలా మరియు స్పైసెస్)లో తనిఖీలు నిర్వహించారు. మసాలా పొడుల ఉత్పత్తి, నిల్వ విభాగాల్లో పరిశుభ్రత లేకపోవడం, అలాగే మసాలా ఉత్పత్తి ముడి పదార్థాలపై లేబుల్ సమాచారం లేదని తదితర వాటిని గుర్తించారు. నిర్వహణ విభాగంలో సరైన రికార్డులు కూడా లేవని వారు పేర్కొన్నారు. 46.75 క్వింటాళ్ల తయారైన సెమీ ఆహార పదార్థాలు (పికిల్స్, అల్లం–వెల్లుల్లి పేస్ట్), మసాలా పొడులు కలిగి ఉన్న రూ. 3 .03 లక్షల విలువైన నిల్వను సీజ్ చేసి, లోపభూయిష్టమైన నమూనాలను ల్యాబ్‌కి పంపించినట్లు పేర్కొన్నారు. సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. నివేదికలో కల్తీ అని నిర్ధారణ అయితే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని టాస్క్‌ఫోర్స్ ఫుడ్‌సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, రవాణా చేసి, విక్రయించే వ్యాపారులు ప్రజలకు సురక్షిత ఆహారం అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు నోటీసులు, సూచనలు జారీ చేశారు. అనుమతుల్లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని టీం హెడ్ వి.జ్యోతిర్మయి హెచ్చరించారు.



పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

రాయదుర్గం/శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడించారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లలో రూ.8.08 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్లు రాగంనాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లను దశలవారీగా సీసీరోడ్లుగా మార్చే ప్రక్రియను ప్రారంభించామన్నారు. అలాగే 64 చెరువులను దశలవారీగా సుందరీకరించాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు ,కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభం


క్యాంటిన్ ప్రారంభించిన సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ 7వ ఫేజ్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను శుక్రవారం పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌డీసీ సెంట్రల్ కమిటీ సెక్రటరీ కరుణాకర్ నాయుడు, పుష్పారెడ్డి, నాయకులు సంజీవరావు, మేకల మైకల్, తమ్మినేని ప్రవీణ్‌కుమార్, రేష్మ, సంధ్య, పొన్నం రజిత, బండి సుధా తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సిబ్బందిని ఆదేశించారు. దుండిగల్, శామీర్‌పేట మండలాల్లోని పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా దుండిగల్ మండలంలోని మల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు ఉన్నాయా..? అని ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శామీర్‌పేట మండలంలోని తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో దుండిగల్, శామీర్‌పేట్ తహసీల్దార్లు మతీన్, యాదగిరిరెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 99.72 శాతం మంది హాజరు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 230 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కాగా, 99.72 శాతం విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి తెలిపారు. జిల్లాలో మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 47,329 మంది ఉండగా 47,195 మంది హాజరు కాగా 134 మంది గైర్హాజర్ అయినట్లు తెలిపారు. అలాగే 140 మంది ప్రైవేట్ విద్యార్థులకు 113 హాజరు కాగా 27 మంది పరీక్షలు రాయలేదని పేర్కొన్నారు. కీసర మండలకేంద్రంలోని ఓ కేంద్రంలో వసతులు సరిగా లేవని ఫిర్యాదు అందిన వెంటనే పరిష్కరించామని తెలిపారు. ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా కూడా అందిన ఫిర్యాదులపై ఆమె తక్షణమే స్పందించి సంబంధిత ఎంఈఓ ద్వారా పరిష్కారమయ్యేలా ఆదేశాలిచ్చారు. పరీక్షా పత్రాల తరలింపు తదితర వాటిని డీఈఓ ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

మూసాపేట ప్రభుత్వ పాఠశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


పది పరీక్షలు ప్రారంభం

మొదటిరోజు 10178 మంది హాజరు, 25 మంది గైర్హాజరు

మూసాపేట: పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కూకట్‌పల్లి మండల పరిధిలో 38 సెంటర్లలో 7948 మంది విద్యార్థులు హాజరయ్యారు. 16 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. బాలానగర్ మండల పరిధిలో 11 సెంటర్లలో 2230 మంది హాజరయ్యారు. 9 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని బాలానగర్ మండల ఎంఈఓ హరిచంద్ తెలిపారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆయా పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించారు. ప్రతి ఒక్క విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇచ్చారు.


విద్యార్థుల హాల్ టికెట్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు


మూసాపేట ప్రభుత్వ పాఠశాలలో హాల్‌టికెట్ నెంబర్‌ను చెక్ చేసుకుంటున్న విద్యార్థులు

ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

జేఎన్‌టీయూహెచ్ డీఈఐఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీదేవి



కేపీహెచ్‌బీకాలనీ: నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని జేఎన్‌టీయూహెచ్ డీఈఐఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. శ్రీదేవి అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన అంకుర్–2025 కార్యక్రమంలో భాగంగా జరిగిన అకాడమిక్ ఇంక్యుబేషన్ మీట్‌లో ఆమె మాట్లాడారు. సాంకేతిక విద్యారంగ పురోగతి ఆధునిక ఆవిష్కరణలపైనే ఆధారపడి ఉందన్నారు. చిన్న చిన్న ఆలోచనల నుంచే ఆవిష్కరణలు ఆవిర్భవిస్తాయని, ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడమే ఇంక్యుబేషన్ కేంద్రాల పని అన్నారు. అనంతరం నిధుల సేకరణ అంశాలపైన జీరా వెంచర్స్ సీఎస్ఓ మొయినా క్వాజి, సాంకేతికత బదలాయింపు, ఆవిష్కరణల పురోగతి అనే అంశంపై నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎస్ఆర్ఎం విజయ్‌కుమార్ సాహుతో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు.



‘రాజీవ్ యువ వికాసం’ పథకానికి దరఖాస్తు చేసుకోండి

సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువత ‘రాజీవ్ యువ వికాసం’ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఏడీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21–55 ఏళ్ల మధ్యనున్న అభ్యర్థులు ఉపాధి హామీ పథకానికి, 21–60 ఏళ్లు కలిగి ఉన్న అభ్యర్థులు భూసంబంధ, ఉద్యానవన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంవత్సర ఆదాయం (గ్రామీణ పాంతాల వారికి రూ.1.50 లక్ష, పట్టణ/మున్సిపాలిటీ వారికి రూ.2 లక్షలకు మించి ఉండవద్దన్నారు. మీ–సేవ నుంచి పొందిన కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 5 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంతో సహా 040-24020610 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఓవర్సీస్ పథకానికి..

ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఉపకార వేతనాల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా వచ్చే నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.


కాంగ్రెస్ ఏ బ్లాక్ మహిళా కమిటీలో వైస్ ప్రెసిడెంట్‌గా సులోచన, జనరల్ సెక్రటరీలు యోగేశ్వరిదేవి, కృష్ణవేణి, జాయింట్ సెక్రటరీలు శారద, అనితా బాయిలకు నియామకపత్రాలను అందజేశారు.
- ఆల్విన్‌కాలనీ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462